


డైరెక్టర్:

## కె. వి. రెడ్డి

సహాయదర్శకుడు:-
కె. కామేశ్వరరావు, బి. ఏ.

సినేరియో ఫోటోగ్రఫీ:-
రామనాథ్, బి. ఏ.

ఆర్టుడైరెక్షన్ ఆడియోగ్రఫీ:-
శేఖర్.

రచన:-
సముద్రాల

సంగీతము:-
చిత్తూరి వి. నాగయ్య.

నాట్యము:-
శ్రీనివాసకులకర్ణి, బి. ఏ.

## — కథాసంగ్రహము —

" అంబుజోదర దివ్యపాదారవింద
చింతనామృతపానవిశేషమత్త
చిత్త మేరీతి నితరంబుజేరనేర్చు "

అన్న మహావాక్యము ఆదర్శముగా జీవించి తరించిన కవిశేఖరుడు, మహాభక్తుడు బమ్మెర పోతనామాత్యుడు. ఏకశిలా నగరవాసి, నిరాడంబరజీవి, రాముని భూమినినమ్మి పొలపుపంటలో జీవించుచు, రామనామ భజనముచేయుచు, నిత్యసంతోషియై కాలముపుచ్చుచుండెను. భార్య నరసమాంబ, శ్రీనాథ కవిసార్వభౌముని చెల్లెలు. కుమారుడు మల్లన, చిన్నారి చిట్టి కూతురు లక్ష్మి. శ్రీనాథుని కూతురు శారదకూడ తరుచు మేనత్తగారింటనే పెరుగుచున్నది. పైపెచ్చు శారద వారికి కాబోయే కోడలు.

చంద్రగ్రహణమునాడు నదీతీరమున సమాధినిష్ఠుడై యుండగా శ్రీరామచంద్రమూర్తి పోతనమహాకవికి సాక్షాత్కరించి శ్రీభాగవతమును తెలిగించి తనకంకితమిమ్మని కోరెను. మహాప్రసాదమని పోతన భాగవతరచనము ప్రారంభించెను. ఏడుస్కంధములు ఏకథాటిగా నడచినవి. అష్టమస్కంధమున గజేంద్రమోక్షములో గంటము సాగలేదు. "అల వైకుంఠపురంబులో"- ఆపైన ఏమి వ్రాయవలయును? పోతన ఆవేదన గ్రహించి శ్రీరామచంద్రుడే పోతనవేషమున యింటికివచ్చి ఆపద్యము పూరించి వెళ్లెను. పోతన యీసంగతి నెరిగి అమితానందము నందెను. రామానుగ్రహమున భాగవతరచనము పూర్తియగుచుండెను.

అంతలో దేశసంచారము ముగించుకొని రాచకొండకు పోవుచున్న శ్రీనాథ మహాకవి ఏకశిలానగరమునకు విచ్చేసెను. మాటల ధోరణిలో మేనకోడలు లక్ష్మి తనతండ్రి పెద్దపుస్తకము వ్రాయుచున్నాడని మామతో చెప్పెను. "మందారమకరంద మాధుర్య"మను పద్యమును పాడి వినిపించెను. ఆ కవితామాధుర్యమునకు కవిసార్వభౌముడు ముగ్ధుడైపోయెను.

శ్రీనాథుడు రాచకొండకువచ్చి ఆదుర్గము నేలుచున్న సర్వజ్ఞ సింగభూపాలుని సమ్ముఖమున తన బావగారైన పోతనగారి కవిత్వము వెదజల్లెను. పండితుడు, కవి, కవితాపోషకుడునైన సింగభూపాలుడా కవితామాధురికి తన్మయుడై తనకు ఆ కృతిని అంకితము చేయింపుమని కోరెను. అట్టులే కానిండని శ్రీనాథుడు పోతనకడకువచ్చెను. కాని పోతన ఆమాట కంగీకరింపక అది మహాపచారమని పెడచెవి పెట్టెను. శ్రీనాథునివలన యీసంగతివిన్న సింగభూపాలుడు తనపట్టు వదలక భేదోపాయము చేసియైనను తన్ను కృతార్థుని చేయుమని నిర్బంధించెను.

శ్రీనాధుడేమిచేయగలడు? మరల ఏకశిలా నగరమునకు వచ్చి బావతో భాగవతాంకితపు ముచ్చట తీసికొనివచ్చెను. ఆయన వినలేదు. నర సమాంబకూడ మగనికిచెప్పిచూచెను, కాని పోతన అసంభవమని ఆచోటు విడిచి వెళ్లిపోయెను. శ్రీనాధుడు మరియొక పన్నాగము పన్నినాడు. చెల్లెలితో "మీఆయన భాగవత గ్రంధమును రాజున కంకితమిచ్చు నంతవరకు శారదను మల్లనకీయజాల"నని, శారద ఈపశువులలో జీవించుట నాకిష్టము లేదనీ" శ్రీనాధుడు ఖండితముగా చెప్పివైచెను. అదివిన్న మల్లన మనసు చివుక్కుమన్నది. శారదను సరాలున లాగికొనివచ్చి "మీకిష్టమువచ్చిన వారికిచ్చుకొమ్మని" శ్రీనాధుని యొడిలోనికి తోసెను. అట్లు జరుగునని ఆకవిసార్వభౌము డనుకొనలేదు, రాజకార్యము నెరవేరకపోగా బంధు ద్వేషము కొనితెచ్చుకొన్నాడు. అందరికీ తలకొకతీరుగా మనసులో ముల్లు గుచ్చుకొన్నట్లయినది, మూలకొకరుగా మూతిముడుచుకొని ఖిన్నులై యున్నారు. లక్ష్మి లోనికివచ్చి ఈదృశ్యము చూచినది, అంతయుమౌనము. అందరు దుఃఖపడుచున్నారు,

కన్నీటితో లక్ష్మి లోనికేగి తండ్రికడ కూర్చున్నది. దైవప్రార్థన ముగించుకొని పోతన చూచి ఏమని ప్రశ్నించినాడు. లక్ష్మి ఆయనను వెలికి తీసుకొనివచ్చి "ఇందరి దుఃఖమునకు కారణము మీరే, వీరందరినీ సంతోషపెట్టు నాన్నా" అని బతిమాలినది. పోతన దృఢనిశ్చయము మెత్తబడినది. "దైవసంకల్పము కానీతల్లీ" యని మరల పూజామందిరములోనికి వెళ్లినాడు. "నీవుకూడ ఇతరులవలె ఆకటిచిచ్చుకు నన్నమ్మెదవా" అన్నట్లు కన్నీటితో సరస్వతి సాక్షాత్కరించినది. మెత్తవారిన మనసు మరల కరుడు గట్టినది. ముమ్మాటికీ అట్లు చేయనని సరస్వతికి బాస చేసినాడు. ఆదైవనిర్ణయము బావకు తెలిపెను. శ్రీనాధుడు శారదతో కదలి రాచకొండకు వెళ్లినాడు.

రాచకొండలోగూడ శ్రీనాధునికి కాలము ఎదురేయైనది. రాజునకు పోతనపై కలిగిన అనురాగము అసూయగా మారి బలాత్కారమున భాగవతమును తెప్పింతునని పట్టుబట్టెను. పోతనకై ప్రాధేయపడినచో మీ గౌరవముకూడ దక్కదని నొక్కిచెప్పెను.

రాజభటులు ఆరాత్రియే భాగవతముకొరకై ఏకశిలానగరమునకు వచ్చిరి. కాని ఆ మహాకవి ముంగిటిలో రామనామశ్రవణము చేయుచున్న అంజనేయమూర్తి వారినిచూచి ఉగ్రుడై కొండవలె మేనుపెంచెను, ఆ ధాటి కాగజాలక రాజుకడకేగి సత్యము విన్నవించుకొనిరి. కలికాలమున

మానవుల వాకిటిలో దేవతలు కాపలాకాయుట! రాజు నమ్మజాలకపోయెను. సేనాపతిని పిలిపించి, స్వయముగావెళ్లి, పోతనను దేశబహిష్కారము కావించి భాగవతమును తీసికొనిరమ్మని అజ్ఞాపించెను.

అంతకుముందే శ్రీనాధుడు పండితులను, బ్రాహ్మణబృందమును వెంటతీసుకొని బావగారిల్లుచేరెను. ఇందరికా పేదరైతు విందుచేయవలెను. అమాయకురాలు నరసమ్మ ఆరివారమింతింతకాదు. ఎన్నిచెప్పినా పోతన నిర్భయుడైయుండెను. చివరకు చేయునదిలేక సీతాదేవిని ప్రార్థించెను. ఇల్లంతయు సరసరాజాన్నములతో నిండిపోయినది. అందరు విందులారగించి తమలము చేయుచుండగా శ్రీనాధుడు మరల ప్రాతపాట ప్రారంభించెను. ఎవరెన్నివిధముల చెప్పినను పోతన వినలేదు, విసిగి భాగవతమును చులకనచేయనెంచి "సిరికించెప్ప" దన్న పద్యమును ఆధారముగా విమర్శించెను. అంతలో దొడ్డిలో లక్ష్మి "శారద భావి" యని కేకవేసినది. అదివిని శ్రీనాధుడు ఆతురతతో దొడ్డిలోనికి పరుగిడెను. అతనివెంట అక్కడున్నవారందరూ వెళ్లిరి. శారద సురక్షితముగా నున్నది. అనిత్య సంబంధాలతో అల్లాడే మనకే ఇంత తొందరపాటు కలవరమున్నప్పుడు. ఆ ఆపన్నప్రసన్నునికి తన భక్తులయెడ యింకెంత యుండవలయునని పోతన శ్రీనాధుని విమర్శకు సమాధానము చెప్పెను. తన అజ్ఞానము మన్నింపుమనీ, నీవు మహర్షివికాని సాధారణ కవిమాత్రుడవు కావని శ్రీనాధుడు క్షమాభిక్ష గోరెను.

అంతలో వాకిటిలో "పోతన యెవరని" పిలుపు. సేనాపతి బహిష్కారపత్రము పోతనకు వినిపించెను. ఆ మహాభక్తుడు ఆలుబిడ్డలతో, కట్టుగుడ్డలతో ఊరువిడిచి వెళ్లిపోయెను.

రాజభటులు భాగవతమును సమీపించుటకై బ్రహ్మ ప్రయత్నము చేసిరి. విష్ణుచక్రము దానిని కాపాడుచుండెను. ఆసంగతిని రాజునకు నివేదింపగా ఆయన మండిపడి, ఆయిల్లు పడగొట్టుడు, ఆగ్రంధము పాతిపెట్టుడని హుంకరించెను. దైవశక్తిన్నియెదిరి సాధించుట మానవబలమునకు సాధ్యమా! పోతన మహాకవి ఇంటిపైబడిన ఒక్కొక్కదెబ్బ ఒక్కొక్క పిడుగువలె రాజప్రాసాదమునకు, రాజ హృదయమునకు తగులుచుండెను. తన కనులముందు నిష్కారణముగా తాను, తన సర్వస్వము నాశనమగునట్లు ఆ రాజునకు తట్టెను. ఇప్పటికైనను నీ అపరాధమునకు క్షమాభిక్ష వేడుకొమ్మని అంతర్వాణి ప్రబోధించెను.

ఉ॥ అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల పె
ద్దమ్మ సురారులమ్మ కడుపారడిపుచ్చినయమ్మ తన్నులో
నమ్మిన వేల్పుటమ్మల మనంబుల నుండెడియమ్మ. దుర్గ. మా
యమ్మ. కృపాబ్ధి యిచ్చుత మహత్వ కవిత్వ పటుత్వసంపదల్॥

శా॥ శ్రీ కైవల్యపదంబు చేరుటకునై చింతించెదన్ లోక ర
క్షైకారంభకు భక్తపాలన కళాసంరంభకున్ దానవో
ద్రేకస్తంభకు కేళిలోల విలసద్దృగ్జాల సంభూత నా
నా కంజాత భవాండకుంభకు మహానందాగనా డింభకున్॥

మ॥ అల వైకుంఠపురంబులో నగరిలో నామూలసౌధంబు దా
పల మందారవనాంతరామృతసరఃప్రాంతేందు కాంతోపలో
త్పల పర్యంక రమావినోదియగు నాపన్నప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము పాహిపాహియన కుయ్యాలించి సంరంభియై

పోతన:—(పాట)

నను పాలింపగ నడచి వచ్చితివా — కరుణాసాగర శ్రీరామా.
సుమధురహృదయా దయామయా — కరుణాసాగర శ్రీరామా.
వచ్చితివా మాయింటికి రామా — యిచ్చితివా నీ కవితా
కరుణాసాగర శ్రీరామా.
నీ కరుణాపూరముతో. నీ కవితాసారముతో
యీయిల్లూ ఈ కవితా పావనమాయెనురా
కరుణాసాగర శ్రీరామా.
శ్రీరామా జయరామా
రఘురామా కరుణాసాగర శ్రీరామా.

లక్ష్మి & పోతన:—

పరాత్పరా పాపహరా నిరామయా — కరుణాసాగర శ్రీరామా
శ్రీరామా జయరామా రఘురామా — కరుణాసాగర శ్రీరామా
॥ నను పాలింపగ....

అజామీల:—(ప్రాత జానపదగీతము)

ఇంటిముందర సిక్కుడుచెట్టు — యెట్ల గొస్తవా సొగసుకాడ
కొమ్మకొమ్మ సోకకుండ — రొమ్ముమీద పడదుంకుర జాణ
చిక్కితి, నీచేతిలోన దక్కితి॥—

ఉంటే మావూరిలోవుందు — పోతే మీవూరికి పోరా
చుట్టుపక్కల వూళ్లలోవుంటే — సూడక నామనసుండదు జాణ
చిక్కతి నీ చేతిలోన దక్కతి॥—

అతి్మ:—

సీ॥ మందార మకరంద మాధుర్యమునదేలు
మధుపంబు వోవునే మదనములకు
నిర్మల మందాకినీ వీచికలదూగు
రాయంచ చనునె తరంగిణులకు
లలితరసాల పల్లవఖాదియై చొక్కు-
కోయిల సేరునే కుటజములకు
పూర్ణేందుచంద్రికాస్పురిత చకోరకం
బరుగునే సాంద్ర నీహారములకు
అంబుజోదర దివ్యపాదారవింద
చింతనామృతపాన విశేషమత్త
చిత్త మేరీతి నితరంబు చేరనేర్చు
వినుత గుణశీల మాటలు వేయునేల.

భోగిని:—(పాట)

మంచి సమయము రారా ఇది....
చలమేల చేసేవవురా
నిన్నెకోరి నీకై నిలిచితిరా
రాదా కోరికదీర మనకిది ॥ మంచి ॥
లేదా కనికర మింతైనా లేదా
ఈ మేను నీదేకాదా వాదా
ఓరీ ఎంతో నెమ్మది నినుకోరి
వలచినందుకు ఒకసారీ
పలుకవైతివి ననుచేరీ
ఫల మేమిక నిను దూరీ
రారా సామీ రారా
ను కవుగిటికే గైకోరా
మనసార ఒక ముద్దీరా
మంచి సమయము రారా॥

పోతన:—(పాట)

నన్నువిడచి కదలకురా రామయ్యరామా
కోదండరామా పట్టాభిరామా— ॥ నన్నువిడచి ॥
నిన్నువినా పరుల సన్నుతింపనురా....
నన్నువిడచి కదలకురా వదలకురా
జానకీరమణ నా జతబాసి చనబోకు
మానససుమముల మనసార పూజింతు ॥ నన్ను ॥
రాతినాతిగజేసినా గుహరాజునూ దయజూచినా
వైరితమ్ముని గాచినా శరణాగతావన పావనా ॥ నన్ను ॥
నీవే గతియనీ నెరనమ్మితీ సీతాపతీ
నీవె నను విడనాడినా గతిలేదుగద మరివేరే వినరా ॥ నన్ను ॥

మల్లన:—

ఉ॥ బాలరసాలసాల నవపల్లవకోమల కావ్యకన్యకన్
కూళలకిచ్చి యప్పడుపుగూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైననేమి, గహనాంతరసీమల కందమూలకౌ
ద్దాలికులైననేమి నిజదార సుతోదర పోషణార్థమై.

నరసమ్మ:—(పాట)

నమ్మితినమ్మా సీతమ్మా
కదలిరమ్మా మాయమ్మ
దయాంబురాశివి జననీ, దయసేయగదే నెనరూనీ
ధరణిసుతా నమ్మితినే
చెయివిడకే, యేమరకే ॥ నమ్మితి ॥

లక్ష్మి:—(పాట)

ఆటలాడదూ వదిన పాటపాడదూ
దీనతతో - మౌనముతో - దిగులుపాటుతో
చిలుకలతో పలుకదు - హంసలతో ఆడదూ
కోయిలతో పాడదూ - నెరికురులను ముడువదూ ॥
జలకమాడదూ - కస్తూరితిలకమూనదూ
పూవులూ సొమ్ములూ - తురుమదూ తొడుగదూ ॥
భోజనమే సేయదూ - నీరయినా త్రాగదూ
ఏమేమో కలవరించు - కనుల నీలాలు నించు ॥ ఆట ॥

శ్రీనాథ:—

మ॥ సిరికింజెప్పడు శంఖచక్రయుగముం జేదోయి సంధింప డే
పరివారంబును జీర డభ్రగపతిం బన్నింప డాకర్ణికాం
తరధమ్మిల్లము చక్కనొత్తడు వివాదప్రోత్థిత శ్రీకుచో
పరిచేలాంచాలమైన వీడడు గజప్రాణావనోత్సాహి యై॥

పోతన:—(పాట)

రామరామ సీతారామా
మేఘశ్యామా - మంగళధామా
మేఘశ్యామా - మంగళధామా
రఘురామా - రాజలలామా ॥ రామరామ ॥
పావననామా - పాపవిరామా
జానకీరామా - జయరామా
రవికులసోమా - రణతలభీమా
శివనుతనామా - శ్రీరామా........... ॥ రామ ॥

సింగభూపాల:—

ఉ॥ ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులుం
సొమ్ములు కొన్నిపుచ్చుకొని చొక్కి శరీరమువాసి కాలుచే
సమ్మెటవ్రేటులంబడక సమ్మతి శ్రీహరికిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరాజొకడు భాగవతమ్ము జగద్ధితమ్ముగన్.

నటీనటులు

| | |
|---|---|
| చిత్తూరి. వి. నాగయ్య.... | పోతన |
| జంధ్యాల గౌరినాధ శాస్త్రి .... | శ్రీనాధ |
| డాక్టరు. వి. ఆర్. శర్మ.... | సింగభూపాల |
| వి. శివరామ్.... | మల్లన |
| డి. హేమలతాదేవి .... | నరసమాంబ |
| మాలతి .... | శారద |
| కుమారి వనజాగుప్త.... | లక్ష్మి |
| సాంమ్రాజ్యం .... | భోగిని |

స్వతంత్ర, నెల్లూరు.